# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 05-10-2024          సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ తిరుమల కొండపై ప్రశాంతతకు ఎక్కడా భంగం కలగకూడదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు టీటీడీ అధికారులకు స్పష్టం చేశారు.
- ❖ దేశంలో ఆక్వా ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు "ప్రధానమంత్రి మత్స్య సంపద పథకాన్ని" తీసుకువచ్చామని కేంద్ర సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ అన్నారు.
- ❖ రామాయపట్నం, బందరు పోర్టులను 5 సంవత్సరాల్లోగా పూర్తి చేస్తామని ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు నూతన ఛైర్మన్ దామచర్ల సత్య తెలిపారు.
- ❖ విద్యార్థులకు ఏ రంగంలో ఆసక్తి ఉందో గుర్తించి ఆ దిశ గా ప్రోత్సహించాలని పాడేరు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్ సూచించారు.

=======================

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరుమలలోని పద్మావతి అతిథిగృహంలో ఈరోజు టిటిడి అధికారులతో సమీక్ష నిర్వహించారు. జీవ వైవిధ్య పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలపై ఆయన ఈ సందర్భంగా అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. టిటిడి సేవలపై భక్తుల నుంచి స్పందనను తెలుసుకోవాలని, వారి సూచనల ఆధారంగా టిటిడి పని చేయాలని ఆదేశించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... తిరుమల ప్రశాంతతకు ఎక్కడా భంగం కలగకూడదని అన్నారు. తిరుమల ఆలయ పవిత్రతను కాపాడుతూ.. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అటవీ ప్రాంతాన్ని 72 నుంచి 80 శాతానికి పైగా పెంచాలని, భక్తుల పట్ల టిటిడి సిబ్బంది గౌరవంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 29 సెకన్లు)

=======================

దేశంలో ఆక్వా ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి మత్స్య సంపద పథకాన్ని తీసుకువచ్చిందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ అన్నారు. జాతీయ మత్స్య సంపద అభివృద్ధి బోర్డు, నెల్లూరు మత్స్యకార సంక్షేమ సమితి సంయుక్త ఆధ్వర్యంలో నెల్లూరులో ఈరోజు జరిగిన "ఫిష్ ఫుడ్ ఫెస్టివల్"ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... "పి.ఎం. మత్స్యకార యోజన" కింద కేంద్ర ప్రభుత్వం భారీగా నిధులను కేటాయిస్తోందన్నారు. అలాగే "పి.ఎం.విశ్వకర్మ యోజన"లో మత్స్య కారులను కూడా చేర్చిందన్నారు. మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కొత్త పరిశ్రమల ఏర్పాటుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని.. వీటి ఏర్పాటుకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేస్తామని శ్రీనివాస వర్మ పేర్కొన్నారు.

=======================

రామాయపట్నం, బందరు పోర్టులను 5 సంవత్సరాల్లోగా పూర్తి చేస్తామని ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు నూతన ఛైర్మన్ దామచర్ల సత్య తెలిపారు. మారిటైమ్ బోర్డు ఛైర్మన్‌గా ఈరోజు ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... మారిటైమ్ బోర్డు ద్వారా 20 వేల కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులు చేపడతామని, మత్స్యకారులకు మేలు జరిగేలా ఫిషింగ్ హార్బర్ల నిర్మాణానికి కృషి చేస్తానని తెలియజేశారు. మరోవైపు ఏపీఎస్ ఆర్టీసీ ఛైర్మన్‌గా కొనకళ్ల నారాయణ ఈరోజు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రులు కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్ పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు ఆయనకు అభినందనలు తెలియజేశారు. కొనకళ్ల నారాయణ గతంలో రెండు సార్లు మచిలీపట్నం పార్ల మెంట్ సభ్యులుగా పని చేశారు.

=======================

దేశంలోనే మొదటి 10 విమానాశ్రయాల్లో విజయవాడ విమానాశ్రయాన్ని ఒకటిగా తీర్చిదిద్దటమే లక్ష్యంగా పెట్టుకున్నామని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివ నాథ్ తెలిపారు. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానాశ్రయ సలహా కమిటీ సమావేశంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఛైర్మన్ ఎం.పి వల్లభనేని బాలశౌరి, వైస్ ఛైర్మన్, ఎం.పి కేశినేని శివ నాథ్, ఎయిర్ పోర్ట్ డైరెక్టర్ లక్ష్మీ కాంత్ రెడ్డి అంతర్జాతీయ విమానాశ్రయ అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అమరావతికి రాకపోకలు పెరుగుతున్నందున వీలైనంత త్వరగా విమానాశ్రయ నూతన టెర్మినల్ భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని గుత్తేదారులను ఆదేశించారు.

=======================

గుంటూరు జిల్లా తెనాలిలో కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖమంత్రి నాదెండ్ల మనోహర్ తో కలిసి స్థానిక సమస్యలపై అధికారులతో ఈరోజు సమీక్ష నిర్వహించారు. అనంతరం కేంద్ర సహాయ మంత్రి మాట్లాడుతూ... తెనాలి పట్టణంలో రహదారులు, పాఠశాలలు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ఇకపై నిరంతర సమీక్షలు నిర్వహిస్తూ ముందుకు వెళ్తామని తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు పూర్తి స్థాయిలో అమలయ్యేలా కృషి చేస్తానన్నారు. గ్రామీణ గృహనిర్మాణ పథక లబ్దిదారులకు కేంద్రప్రభుత్వ సహకారం పెరుగుతున్న నేపథ్యంలో వచ్చే సంవత్సరం ఏప్రిల్ 1 నుండి నూతన లబ్దిదారులను ఎంపిక చేసే ప్రక్రియను చేపడతామని మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

విరామం

=======================

విద్యార్థులకు ఏ రంగంలో ఆసక్తి ఉందో గుర్తించి ఆ దిశ గా ప్రోత్సహించాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్ సూచించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటీడీఏ పరిధిలోని ఎండపల్లివలస ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్వహించిన 5వ రాష్ట్ర స్థాయి సాంస్కృతిక సాహిత్య ఉత్సవం ముగింపు వేడుకలకు ఈరోజు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అన్ని గిరిజన సంక్షేమ పాఠశాలలు విద్యార్థుల సాంస్కృతిక

సాహిత్య ఉత్సవాలను నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. గిరిజన విద్యార్థులకు కళలు, సాంస్కృతిక సాహిత్య రంగంలో ఎంతో ప్రతిభ కనబరుస్తున్నారని కొనియాడారు. ఈ వేడుకల్లో రాష్ట్రంలోని 28 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

=======================

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు "ఏక్ పేడ్ మా కే నామ్".. "అమ్మ పేరిట ఒక మొక్క" కార్యక్రమంలో భాగంగా వీఎంఆర్‌డీఏ కమిషనర్ కే.ఎస్.విశ్వనాధన్ విశాఖలోని రాణి చంద్రమణి దేవి ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో ఈరోజు మొక్కలు నాటారు. మూడు ఎకరాల స్థలంలో రూపుదిద్దుకున్న జీవవైవిధ్య ఉద్యానవనాన్ని ఆయన వీఎంఆర్‌డీఏ సిబ్బందితో కలిసి సందర్శించారు. దీనికి సంబంధించిన సమాచారాన్ని మా ఆకాశవాణి విశాఖపట్నం ప్రతినిధి వి.ఎస్.ఎన్. మూర్తి తెలియజేస్తూ...

(వాయిస్ 31 సెకన్లు)

=======================

శ్రీ వేంకటేశ్వర స్వామి వారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు తిరుమలలో వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఈరోజు ఉదయం స్వామివారిని చిన్నశేష వాహనంపై మాడవీధుల్లో ఊరేగించారు. మురళీకృష్ణుడి అవతారంలో ఆయన భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల వరకు స్నపన తిరుమంజనం నిర్వహించామని, రాత్రి 7 నుండి  నుంచి 9 గంటల వరకు హంస వాహనసేవ జరగనుందని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు వెల్లడించారు.

=======================

పార్వతీపురం మన్యం జిల్లాలో నమోదైన ఈ-క్రాప్ పంట నమోదు వివరాలను కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈరోజు జిల్లాలోని సీతానగరం మండలం కాశయ్య పేటలో నమోదైన ఈ-క్రాప్ పంట నమోదును తనిఖీ చేశారు. పంట నమోదు పట్ల స్థానిక రైతులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పంటలను ఈ-క్రాప్ ద్వారా నమోదు చేసుకుంటే కలిగే ప్రయోజనాలను కలెక్టర్ రైతులకు ఈ సందర్భంగా వివరించారు. కాగా పంటల బీమా సహా నష్ట పరిహారం, గిట్టుబాటు ధర, పీఎం కిసాన్, అన్నదాత వంటి పథకాలు అన్నీ ఈ-క్రాప్ నమోదుతోనే ముడిపడి ఉన్నాయని.. అందుకే ప్రతి రైతు తాము సాగు చేస్తున్న పంటలను ఈ-క్రాప్ ద్వారా తప్పని సరిగా నమోదు చేసుకోవాలని ప్రభుత్వం కోరుతోంది. తద్వారా రైతులకు ప్రభుత్వ పథకాలన్నీ అందుతాయని స్పష్టం చేసింది.

=======================

పశ్చిమ మధ్య మరియు దానిని ఆనుకొని ఉన్న దక్షిణ బంగాళాఖాతం మీదుగా ఉన్న నిన్నటి ఎగువ ఉపరితల ఆవర్తనం, ఇప్పుడు పశ్చిమ మధ్య బంగాళాఖాతం మీదుగా ఆంధ్రప్రదేశ్ తీరంలో సగటు సముద్ర మట్టానికి 1.5 నుండి 4.5 కిలో మీటర్ల ఎత్తులో ఉందని అమరావతిలోని భారత వాతావరణకేంద్రం తెలిపింది. ఈ ఉపరితల ఆవర్తనము ప్రభావంతో రాష్ట్రంలో తేలికపాటి నుండి ఒక  మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే  అవకాశముందని వెల్లడించింది. అలాగే ఉరుములతో  కూడిన మెరుపులు ఒకటి  లేదా రెండు  చోట్ల సంభవించే  అవకాశముందని వాతావరణ శాఖ పేర్కొంది.

=======================

ప్రస్తుత ఖరీఫ్ సీజన్ కు సంబంధించి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఇబ్బందికరంగా మారిన రైసు మిల్లుల ర్యాండమైజేషన్ ప్రక్రియను ప్రభుత్వం రద్దు చేసిందని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా సంయుక్త కలెక్టర్ టీ. నిషాంతి తెలిపారు. పౌరసరఫరాల శాఖ కమిషనర్ జి.వీరపాండియన్, పౌరసరఫరాల కార్పొరేషన్ వైస్ చైర్మన్, మేనేజింగ్

డైరెక్టర్ మనజీర్ జిలానీ అమరావతి నుండి వివిధ జిల్లాల సంయుక్త కలెక్టర్లు, జిల్లాల పౌర సరఫరాల శాఖ అధికారులతో ఈరోజు దృశ్యమాధ్యమ సమావేశం నిర్వహించారు.

========================

========================